### తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి, ఆగస్టు 5: ప్రజలందరు తపాలశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తపాల శాఖ మంచిర్యాల డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పోస్టల్ అధికారి రామరావు సూచించారు. మండలంలోని మ్యదరిపేటలో సోమవారం ప్రజలకు ఆర్థిక అక్షర్యాత, పొదుపు పథకాలు, పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురి నుంచి పోస్ట్ ఖాతాలను ప్రారంభించి వెంటనే వారికి ఖాతా బుక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పోస్టమాస్టర్ గురువయ్య, మాజీ సర్పంచు ఢాంకా లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ కొంగల నవీన్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## నేషనల్ హైవేకు భూములు ఇవ్వం


- ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు



సభా ప్రాంగణంలో బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 5: నేషనల్ హైవే అథారిటీ నూతనంగా సర్వే చేపట్టి చేయాలనుకుంటున్న ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేకు రైతులు భూములు ఇవ్వడంలో ససేమిరా ఒప్పుకోవడం లేదు. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణ సమయంలో విలువైన భూములు లాక్కున్నారని, అప్పుడు వచ్చిన అరకొర పైసలు మాకు అక్కరకు రాలేదని వాపోయారు. మళ్లీ ఇప్పుడు హైవే రోడ్ల కోసం భూములు లాక్కోవాలని చూడడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో పర్యావరణంపై ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణకు లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలతో పాటు హాజీపూర్, మంచిర్యాల, మందమర్రి మండలాల నుంచి హైవేలో భూములు కోల్పోతున్న రైతులను పిలిచి మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతిలాల్ అధ్యక్షతన పర్యావరణంపై అభిప్రాయాలను సేకరించారు. ఇప్పటికే సర్వే పూర్తి అయ్యిందని ఎవరికి ఎంత భూమి పోతుంది, ఎంత వరకు ప్రభుత్వం పరిహారం ఇస్తుందని సభలో చర్చ ఉంటుందని అన్ని మండలాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు. కానీ ఈ సభలో కేవలం హైవే నిర్మాణం చేపడితే పర్యావరణం ఎలా ఉంటుందో చెప్పాలంటూ అధికారులు అనడంతో రైతులు తమతమ బాధలు చెబుతూ తమ భూములు పోతే ఎలా అని కంటతడి పెట్టారు. కొంత మంది రైతులు తమకున్న భూమిని ఇప్పటికే చాలా వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద తీసుకున్నారని, మిగిలి ఉన్న కొంత భూమిలో సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు పర్యావరణం బాగుండాలంటే రానున్న రోజుల్లో మొక్కలు నాటాలని సూచించడం సరికాదని రైతులు పేర్కొన్నారు. తమ భూములు లాక్కుంటే ఊరుకోమని, తమ భూములు ఇవ్వమని పలువురు రైతులు తమ అభిప్రాయాలతో కూడిన వినతి పత్రాలను ఆర్డీవోకు అందజేశారు. అంతేకాకుండా రైతులకు ఏమైనా సరైన సమాచారం ఇవ్వాలంటూ నినాదాలు చేస్తూ సభ ప్రాంగణంలో బైఠాయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మోతిలాల్ రైతులు ఇచ్చిన ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా చూస్తానని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాములు, ఎన్‌హెచ్ నిజామాబాద్ జిల్లా ఈఈ వంశీకృష్ణ, పీడీ అజయ్ మణికుమార్, ఎన్‌హెచ్ ఇన్‌చార్జీ తహసీల్దార్ సత్యనారాయణ, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఎల్‌ఆర్‌ఎస్‌కు మోక్షం




- నాలుగేళ్ల తరువాత ఎట్టకేలకు కదలిక
- జిల్లాలో వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్
- మూడు నెలల్లో పనులు కొలిక్కి వచ్చే అవకాశం
- ఫీజుల విషయంలో స్పష్టతనివ్వని ప్రభుత్వం

మంచిర్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): లే అవుట్ అనుమతుల్లేని వెంచర్లు, ప్లాట్ల క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మూడునెలల్లో దరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులేషన్ స్కీం) కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం లభించినట్లయింది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో 2105లో ఎల్‌ఆర్‌ఎస్ గడువు ముగిసిపోగా, దాదాపు నాలుగు సంవత్సరాల తరువాత తిరిగి 2020 ఆగస్టు 31న ఆ ప్రక్రియకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అదే రోజు నుంచి ఎల్‌ఆర్‌ఎస్ అమల్లోకి వస్తుందంటూ నిబంధనలతో కూడిన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి నాటి ప్రభుత్వం ఎలాంటి నియమ నిబంధనలు విడుదల చేయకపోవడంతో దరఖాస్తు ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. ఆన్‌లైన్ కేంద్రాల్లో సంబంధిత వెబ్‌సైట్ తెరుచుకోకపోవడంతో దరఖాస్తు ప్రక్రియకు బ్రేక్ పడింది. దీంతో చాలా కాలం తరువాత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్న ప్రజలకు నాటి ప్రభుత్వ నిర్వాకం వల్ల ఆ అవకాశం లేకుండా పోయింది.

**ఎల్‌ఆర్‌ఎస్‌కు భారీ స్పందన..**

ఎల్‌ఆర్‌ఎస్‌కు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి పెద్దమొత్తంలో స్పందన వచ్చింది. రియల్ ఎస్టేట్ రంగం ఊపు మీదున్న మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉండగా, మిగతా చోట్ల అరకొరగా దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల్లో అధిక సంఖ్యలో భూములు ఉన్నాయి. వాటిలో అనధికార లే అవుట్ వెంచర్లు ఎక్కువగా ఉండటంతో సంబంధిత ప్రజలు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసేందుకు ముందుకు వచ్చారు. జిల్లా కేంద్రంలోనే పదుల సంఖ్యలో అక్రమ లేఔట్లు ఉండగా, నస్పూర్, లక్షెట్టిపేట, చెన్నూరు, బెల్లంపల్లి మున్సిపాలిటీల పరిధిలో కూడా అధిక సంఖ్యలో అక్రమ వెంచర్లు ఉన్నాయి. అదేవిధంగా గ్రామ పంచాయతీల పరిధిలో కూడా అక్రమ వెంచర్లు, ప్లాట్లు అధికంగా ఉండగా హాజీపూర్, జైపూర్, ముల్కల్ల, వేంపల్లి, లక్షెట్టిపేట లాంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది.

**ఫీజుల విషయంలో స్పష్టత కరువు...**

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పెండింగులో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయాలని నిర్ణయించినందున దరఖాస్తుదారుల నుంచి ఏ మేరకు స్పందన ఉంటుందో వేచి చూడాలి. ఎలాంటి అపరాద రుసుం లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయాలనే డిమాండ్ల నేపథ్యంలో ప్రభుత్వం ఫీజు మాఫీ విషయంలో ప్రస్తుతానికి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గతంలో 14 శాతం ఫీజులు చెల్లించలేని వారు నాలుగేళ్ల గడుస్తున్నా క్రమ బద్ధీకరణకు ముందుకు రావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ విషయమై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో దరఖాస్తుదారులు ఎల్‌ఆర్ ఎస్ ఫీజులు చెల్లించి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తీసుకుంటారో లేదోనన్న చర్చ జరుగుతోంది.

మరోవైపు మూడు నెలల్లో క్రమబద్ధీకరణ పూర్తి చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం కలెక్టరేట్, స్థానిక సంస్థల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రభుత్వ ఆదేశాలతో దరఖాస్తులను రెవెన్యూ, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్, పంచాయతీ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించే పనిలో నిమగ్నమైంది. ఎల్‌ఆర్‌ఎస్‌లో భాగంగా ఇప్పటికే మొదటి దశలో దరఖాస్తులు స్వీకరించగా, రెండో దశలో నిర్ధారిత ఫీజు చెల్లించాల్సిందిగా దరఖాస్తుదారులకు నోటీసు జారీ చేస్తారు. మూడో దశలో పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించే వారికి అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తారు. అలాగే స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నచోట లే అవుట్ అనుమతులు మంజూరు చేస్తారు.

> **40వేల దరఖాస్తులు పెండింగ్..**
>
> 2020 ఆగస్టు 26లోపు రిజిష్టర్డ్ సేల్ డీడ్ ద్వారా జరిగిన నాన్ లే అవుట్ వెంచర్లు, ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ వర్తింపజేయనున్నట్లు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీల నుంచి 40వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి. ఎల్‌ఆర్‌ఎస్‌కు 1000రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో జిల్లా వ్యాప్తంగా 2020 అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య కాలంలో మున్సిపాలిటీల్లో ఏకంగా 39,200 దరఖాస్తులు రాగా, వివిధ మండలాల నుంచి 158 దరఖాస్తులు వచ్చాయి. ఈ విషయమై కొందరు కోర్టును ఆశ్ర యించడంతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు క్లియరెన్స్ లభించలేదు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకొని, ఇల్లు నిర్మించుకునే వారికి మాత్రం కొంత వెసులుబాటు కల్పించడంతో అక్కడక్కడ అవకాశాన్ని కొందరు వినియోగించుకుంటున్నారు. కోర్టు తీర్పునకు లోబడి ఉంటామంటూ అఫిడవిట్ దాఖలు చేయడంతోపాటు ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్ చార్జీల కింద ప్లాటు మార్కెటు విలువపై విధించే 14 శాతం పన్ను చెల్లించిన వారికి ప్రభుత్వం ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇస్తోంది.

# గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

- కలెక్టర్ కుమార్ దీపక్ - జిల్లా వ్యాప్తంగా మొదలైన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం - అవగాహన ర్యాలీల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వెంకటరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్





మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ ,స్పెషల్ ఆఫీసర్, బెల్లంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న చైర్‌పర్సన్, మున్సిపల్ అధికారులు

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 5: గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని వెంకటరావుపేటలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పల్లెలు స్వచ్ఛంగా, పచ్చదనంగా ఉంటేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శ్రమదానంలో పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ స్వప్న, ఎంపీడీవో సరోజ, డీఎల్‌పీవో ధర్మరాణి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వెంకరమణ, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఏసీసీ:** స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమీషనర్ మారుతి ప్రసాద్‌లు అన్నారు. సోమవారం పట్టణంలోని 15,16,17 వార్డుల్లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులో కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం మొక్కలు నాటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జాయింట్ డైరెక్టర్, స్వచ్ఛదనం పచ్చదనం స్పెసల్ ఆఫీసర్ శ్రీపాద రామేశ్వర్, మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్, కౌన్సిలర్ పూదరి సునీత ప్రభాకర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**బెల్లంపల్లి:** ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం నుంచి కాంటా చౌరస్తా వరకు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్ ఏరియాలో పారిశుధ్య పనులను చేపట్టారు. దోమల నివారణ మందులను స్ప్రే చేయించారు. దుకాణదారులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కో ఆప్షన్‌సభ్యులు, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

**జైపూర్:** మొక్కల పెంపకంతోనే మానవాళిమనుగడ సాధ్యమవుతుందని జెడ్పీ సీఈవో గణపతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఇందారం గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి మొక్కలు నాటారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శి సుమన్ పాల్గొన్నారు.

**కన్నెపల్లి:** ప్రతిఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కన్నెపల్లి మండల ప్రత్యేకాధికారి శంకర్ పేర్కొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మొక్కలు నాటారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర, ఏపీఎం అశోక్, ప్రజాప్రతినిధులు, అధికారులు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**దండేపల్లి:** స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని జిల్లా సంక్షేమ అధికారి, మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం దండేపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులు ప్లకార్డులతో ఊరేగింపు ర్యాలీ చేపట్టి గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులు మానవహారం చేపట్టి ప్రజలకు స్వచ్ఛదనం పచ్చదనంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పలు అంశాలపై వివరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక అధికారుల సమక్షంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎంపీవో విజయ్‌ప్రసాద్, నాయకులు గడ్డం త్రిమూర్తి, ముత్యాల శ్రీనివాస్, కట్కూరి రాజన్న, వైద్యాధికారి డాక్టర్ సతీష్, వివిధ గ్రామాల ప్రత్యేధికారులు తదితరులు పాల్గొన్నారు.

- పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని గూడెం గ్రామ ప్రత్యేకఅధికారి అరుణ్ పేర్కొన్నారు. దండేపల్లి మండలం గూడెంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం పలుచోట్ల వివిధ శాఖల సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

**నస్పూర్:** నస్పూర్ మున్సిపాలిటీలో సోమవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వార్డుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పలు వార్డుల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటికి ట్రీగార్డులను పెట్టారు. 1, 2, 4, 5, 24 వార్డుల్లో మొక్కలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, వైస్ చైర్మన్ గెల్లు రజిత-మల్లేష్, కమిషనర్ చిట్యాల సతీష్, కౌన్సిలర్లు, ఏఎన్ఎంలు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**వేమనపల్లి:** మండలంలోని నాగారంలో మండల ప్రత్యేకాధికారి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం పచ్చదనంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. ఏపీడీ సురేష్, అంగన్‌వాడీ టీచర్ అరవింద, కార్యదర్శి సంతోష్‌రెడ్డి, సీఏ రేణుక, ఫీల్డ్ అసిస్టెంట్ దుర్గయ్య, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని నీల్వాయి గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనంపై అడిషనల్ అధికారి సంతోష్ గ్రామసభ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శ్రమదానం చేసి పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, సీసీ రాజారాం, ఆరోగ్య సహాయకుడు చారి, ఎంఎల్‌హెచ్‌పీ తేజస్విని, ఏఎన్ఎం కళావతి, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

**చెన్నూరు:** మండలంలోని కిష్టంపేటలో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. వాటర్ ట్యాంకు ప్రాంతంలో శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం సంకారం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. సుద్దాలలో జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో అజ్మత్ అలీ, హెచ్ఈవో జగదీష్ తదితరులు పాల్గొన్నారు. చెన్నూర్ పట్టణంలోని 16వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొత్త బస్టాండ్‌లో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచనపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాదర్, కౌన్సిలర్ రమేష్, క్లస్టర్ డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



ఇందారంలో మొక్కలు నాటుతున్న జెడ్పీసీఈవో గణపతి

**కోటపల్లి:** మండల కేంద్రంలో మండల ప్రత్యేకాధికారి వినోద్ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కొండంపేటలో ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. అన్ని గ్రామపంచాయతీల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించగా స్వచ్ఛదనం పచ్చదనం అంశాలపై అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను శ్రమదానంతో తీసివేశారు. శానిటేషన్, డ్రైనేజీలను పరిశీలించి సూచనలు చేశారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పారిశుధ్యం, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**హాజీపూర్:** మండలంలోని ముల్కల్లలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ర్యాలీని మండల ప్రత్యేకాధికారి, డీఈవో యాదయ్య, గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కారోబార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

**కాసిపేట:** మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ర్యాలీలను నిర్వహించారు. పెద్దనపల్లిలో మండల ప్రత్యేకాధికారి గంగారం హాజరై ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, మొక్కల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో సఫ్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** మండలంలోని గ్రామాల్లోని స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందుగులపేట, పొన్నారంలో ర్యాలీలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వనిత, ఎంపీడీవో రాజేశ్వర్, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జీ కదారి జీవన్‌కుమార్, కార్యదర్శి వీరేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**భీమారం:** భీమారంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి అధికారులు పాఠశాల నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ అధికారి కృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**జన్నారం:** ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కిషన్, ఎంపీడీవో శశికళ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు రాజశేఖర్, మోహన్‌రెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్సు బీభత్సం

- రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన బస్సు
- ఇద్దరికి తీవ్రగాయాలు... మరో ఇద్దరికి స్వల్పగాయాలు




బస్సు కింద ఉన్న ద్విచక్ర వాహనం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 5: జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. రెండు ద్విచక్ర వాహనాలను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు (టీఎస్ 19 టీ 0213) గోదావరిఖని నుంచి మంచిర్యాలకు వస్తోంది. ఈక్రమంలో టీటీటీ కల్యాణ మండపం వద్దకు రాగానే బస్సు ఎదురుగా వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో ఓ వాహనంపై ప్రయాణిస్తున్న సాయికుంటకు చెందిన రేకుంట రమేష్, ఆయన కూతురు రేకుంట దీపకు తీవ్ర గాయాలయ్యాయి. మరో వాహనంపై ప్రయాణిస్తున్న భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం బండ్లపల్లి గ్రామానికి చెందిన బండి మహేష్, శ్రీరాంపూర్ ఆర్కే-8 కొత్తరోడ్‌కు చెందిన బీర్తి నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రమేష్ తన కూతురు దీప ఇటీవలే నర్సింగ్ కోర్సు పూర్తి చేయగా జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో ఉద్యోగంలో చేర్చేందుకు వెళ్తున్నారు. మహేష్, నవీన్ ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు వెళ్తూ గిఫ్ట్ తీసుకుందామని రావడంతో ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఓ ద్విచక్రవాహనం బస్సు కింద నలిగిపోయి కొంత దూరం వరకు ఈడ్చుకుపోగా, మరో ద్విచక్రవాహనం బస్సు తగిలి పక్కన పడింది. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగే కారణంగా తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ బన్సీలాల్ ఘటనా స్థలానికి చేరుకొని బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వయనాడ్ సంఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ఏసీసీ, ఆగస్టు 5: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌ను సంఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి మానసయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తు కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లా మేపాడి గ్రామంలో చోటు చేసుకుందన్నారు. పర్యావరణ పరంగా రెడ్‌జోన్‌లో ఉన్న ఈ ప్రాంతంలో అన్ని క్వారీలను మూసివేసి నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గోగర్ల తిరుపతి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గోగర్ల శంకర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## టీకాలు అందుబాటులో ఉంచాలి

జైపూర్, ఆగస్టు 5 : సీజనల్ వ్యాధులు సంభవిస్తున్న నేపథ్యంలో పిల్లలు అనారోగ్యాలకు గురికాకుండా అవసరమైన టీకాలను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అనిత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. టీకాలు, అందుబాటులో ఉన్న మందుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

## పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించాలి

దండేపల్లి, ఆగస్టు 5: అప్పుడే పట్టిన బిడ్డకు తల్లి పాలు తాగించాలని లక్షెట్టిపేట ఐసీడీఎస్ సీడీపీవో ప్రాజెక్టు అధికారి రేష్మ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవతింలో భాగంగా ఐసీడీఎస్ఆధ్వర్యంలో దండేపల్లి మండలం తాళ్లపేటలో అంగన్‌వాడీ-2వ కేంద్రంలోని సోమవారం తల్లి పాల విశిష్టత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆరునెలలు పూర్తయిన చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో దండేపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ లక్ష్మి, ఏఎస్ఎంరాధిక, అంగన్‌వాడిటీచర్లు పుష్పలత, జ్యోతిరాణి, పద్మ, ప్రమీల, ఆశా కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** మండలంలోని పొన్నారంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్పెషల్ ఆఫీసర్ సునీత, డాక్టర్ శ్యామల తల్లిపాల ప్రాముఖ్యంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరీష్, అంగన్‌వాడీ టీచర్లు రజిత, నాయకులు సంతోష్, ఫీల్డ్అసిస్టెంట్ ఈద లింగయ్య, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యవర్గ సమావేశం

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 5: బీజేపీ పట్టణ కార్యవర్గాన్ని సమావేశాన్ని పట్టణాధ్యక్షుడు వీరమల్లహరిగోపాల్‌రావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందని దీనిపైపోరాటాలు చేసేందుకు సిద్ధంకావాలని తీర్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్‌జైన్, నాయకులు నరేష్‌చంద్, తిరుపతి, ప్రభాకర్,రమేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ● సీపీఐ కౌన్సిల్ సమావేశం

లక్షెట్టిపేటలో సోమవారం సీపీఐమండల కౌన్సిల్‌సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో స్థానిక సమస్యలపై చర్చించి తదుపరి కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా దేవవరం, సహాయకార్యదర్శిగా రమణారెడ్డి, కోశాధికారిగా భానుచందర్, సభ్యులుగా దేవదాసు, వెంకటేష్, రవి, కిరణ్, రామన్న, సత్తన్న, రాజన్న, ఐలయ్య, పోచయ్యను ఎన్నుకున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పెద్దపీట



ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బండి సదానందంయాదవ్

మందమర్రిటౌన్, ఆగస్టు 5: చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పెద్దపీట వేస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందంయాదవ్ తెలిపారు. సోమవారం మందమర్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మందమర్రి మున్సిపాలిటీలోని 23వ వార్డులో విద్యుత్ స్తంభాలను మంజూరు చేయించి విద్యుత్ కనెక్షన్‌లను ఏర్పాటు చేయించారన్నారు. దీంతో వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అంతేకాకుండా మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారన్నారు. నాయకులు పెద్ది రాజన్న, రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 23వ వార్డులో విద్యుత్ సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి చిత్రపటానికి రాష్ట్రీయ రహదారి వద్ద క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శ్రీరాంపూర్, ఆగస్టు 5: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీసీసీలోని రెయిబో పాఠశాల కరస్పాండెంట్ అమన్ ప్రసాద్ పేర్కొన్నారు. సింప్లిసిటీ డేను పురస్కరించుకొని సోమవారం పాఠశాల విద్యార్థులు జీఎం కార్యాలయం ఎదుట ఉన్న కేంద్ర నర్సరీని సందర్శించారు. తోట పని చేపట్టారు. పర్యావరణం గురించి చిన్నారులకు బాల్యం నుంచే అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజనీ, ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రస్మా మండల అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి

జైపూర్, ఆగస్టు 5: ట్రస్మా జైపూర్ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. ట్రస్మా మండల అధ్యక్షుడిగా గూడ సత్యనారాయణరెడ్డి (సరస్వతి స్కూల్), ఉపాధ్యక్షుడిగా రాజ్‌కుమార్(తేజ స్కూల్), ప్రధాన కార్యదర్శి బషీరొద్దీన్(ఇండియన్ స్కూల్), ట్రెజరర్‌గా ప్రసాద్ (విలియం పబ్లిక్ స్కూల్), జాయింట్ సెక్రెటరీగా మొహిద్(క్రెసెంట్ స్కూల్)ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి పెట్టం మల్లేష్, కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులు అమ్మితే చర్యలు

**- బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ - జిల్లా వ్యాప్తంగా పలు దుకాణాల్లో పోలీసుల తనిఖీలు**

బెల్లంపల్లి, ఆగస్టు 5: దుకాణాల్లో మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ హెచ్చరించారు. సోమవారం తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలకు వంద మీటర్ల దూరంలో దుకాణం యజమానులు ఎట్టి పరిస్థితుల్లో మత్తు పదార్థాలు, గంజాయి, నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని సూచించారు. ఎవరైనా అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులకు కానీ, డయల్ 100కు కానీ సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

● తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు దుకాణాలను తాండూర్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. పోలీసులు పాల్గొన్నారు.

● బెల్లంపల్లి పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు దుకాణాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ దేవయ్య హెచ్చరించారు.

**నెన్నెల**: మండలంలోని మైలారం, ఆవడం గ్రామాల్లో పాఠశాలలకు సమీపంలోని కిరాణం దుకాణాలు, టేలాల్లో ఎస్సై ప్రసాద్ తనిఖీలు చేశారు.

**కాసిపేట:** మండల కేంద్రంలోని దుకాణాలను ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఎస్‌ఐ రవీందర్, పోలీసులు పాల్గొన్నారు.

**జైపూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు సమీపంలో ఉన్న కిరాణం దుకాణాల్లో ఎస్‌ఐ శ్రీధర్ తనిఖీలు నిర్వహించారు. పోలీసులు పాల్గొన్నారు.

**భీమారం:** మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని దుకాణాల్లో సోమవా రం భీమారం ఎస్‌ఐ రాములు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు కిరణ్, మాచర్ల తదితరులు పాల్గొన్నారు.

**కన్నెపల్లి:** మండల కేంద్రంలో ఎస్‌ఐ గంగారాం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల దూరంలో దుకా ణం యజమానులు ఎట్టి పరిస్థితుల్లో మత్తు పదార్థాలు, గంజాయి, నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని సూచించారు.

**భీమిని:** మండలంలోని అన్ని గ్రామాల్లోని దుకాణాలను ఎస్సై విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. గుట్కా, తంబాకులను స్వాధీనం చేసుకున్నారు. మత్తు పదార్థాలను అదుపు చేయడంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

### సంక్షిప్త సమాచారం..

**జన్నారం:** కవ్వాల టైగర్ జోన్ పేరిట ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త భూమాచారి సోమవారం మండలంలోని దర్మారం చౌరస్తాలో కూర్చుని నిరసన తెలిపారు.

**మంచిర్యాల కలెక్టరేట్:** మంచిర్యాల గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకురాలు పుష్పలతను విధుల నుంచి తొలగించాలని కోరుతూ పీడీఎస్‌యూ, యుఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీకాంత్, తిరుపతి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ప్రిన్సిపాల్ అధ్యాపకురాలు నిర్లక్ష్యం వల్లనే డిగ్రీ విద్యార్థిని కరెంటు షాక్‌కు గురైందని పేర్కొన్నారు. లక్షెట్టిపేట మహాత్మాజ్యోతి బాపూలే బాలుర పాఠశాలలో శివకృష్ణ అనే విద్యార్థిని ప్రిన్సిపాల్ కిరణ్ తీవ్రంగా కొట్టడంతో గాయాలయ్యాని వెంటనే ప్రిన్సిపాల్ కిరణ్‌ను సస్పెండ్ చేయాలన్నారు.

**వేమనపల్లి:** ముల్కలపేటకు చెందిన ఒడిల సుధాకర్ ఆరు నెలల క్రితం ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి సోమవారం బాధితునికి అందజేసినట్లు నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు.

**నస్పూర్:** పట్టణంలోని తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే వంటలను ఆయన పరిశీలించారు. వార్డు కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్, హెచ్‌ఎం రామన్న ఉన్నారు.

- ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ ఎదుట తెలంగాణ మాల మహానాడు, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర సైనిక్ దళ్ కన్వీనర్ ఆసాది పురుషోత్తం, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల్తెపు శంకర్, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి ఉన్నారు.

**మందమర్రిటౌన్:** పట్టణంలోని ఊరు మందమర్రికి చెందిన అర్చన -అభిలాష టీం పంచముఖి స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆధ్వర్యంలో రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని ఎస్‌ఐ రాజశేఖర్ అందించారు. సంస్థ అధ్యక్షుడు కృష్ణ చైతన్య ఆచార్య పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

**రూ. 21 వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం**

రామకృష్ణాపూర్, ఆగస్టు 5: పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగడి శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై సోమవారం టాస్క్‌ఫోర్స్, పోలీసుల ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. ముందస్తు సమాచారం మేరకు గద్దెరాగడి శివారు ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఎస్సై ఉపేందర్, లచ్చన్నలు చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో దాడులు చేపట్టినట్లు తెలిపారు. ఆరుగురు వ్యక్తులు, రూ. 21 వేల నగదు, ఆరు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారని వీరంతా గద్దరాగడి గ్రామానికి చెందిన వారని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**మంచిర్యాల అర్బన్:** పట్టణంలోని రాజీవ్‌నగర్ శివారులో ప్రాంతంలో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు ఎస్సై సురేష్, ఏఎస్సై సత్తయ్య, సిబ్బందితో కలిసి దాడి చేయగా నలుగురు పారిపోగా అశోక్‌రోడ్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. వారి వద్ద నుంచి 8,300 రూపాయలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామనిసీఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాలాజీ, కానిస్టేబుల్స్ భరత్, రమేష్ ఉన్నారు.

## 'ప్రజావాణి' ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 5: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఆర్డీవో హరికృష్ణతో కలిసి ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు దరఖాస్తులు అందజేశారు. తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

**● పంచాయతీ రిజర్వేషన్ మార్చాలి**

**జైపూర్:** మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామపంచాయతీ ప్రజలు సోమవారం మంచిర్యాల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పంచాయతీ రిజర్వేషన్ మార్చాలని కోరుతూ నీలం శ్రీనివాస్, వెంకటేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. వెంకట్రావుపల్లి, దుబ్బపల్లి గ్రామాల్లో 235 కుటుంబాలు ఉన్నాయని, ఇందులో 220 కుటుంబాలు నేతకాని ఎస్సీ సామాజికవర్గానికి చెందినవని తెలిపారు. కేవలం 15 కుటుంబాలు మాత్రమే ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవని, గతంలో సర్పంచ్ రిజర్వేషన్ ఎస్టీకి కేటాయించారని, ఈసారి జరిగే ఎన్నికల్లో ఎస్సీకి రిజర్వేషన్ కేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## వరకట్న వేధింపుల కేసులో ముగ్గురి అరెస్టు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 5: వరకట్నం వేధింపుల కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కె నరేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వరకట్నం వేధింపుల కేసులో నిందితులైన సీసీసీ నస్పూర్ ఆర్కే-5 ప్రాంతానికి చెందిన తనుగుల మధూకర్, తనుగుల ప్రమీళ, తనుగుల నారాయణ అనే ముగ్గురు కొన్నిరోజులుగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్నారని తెలిపారు. మొదటి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వారిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా ఎన్‌డబ్ల్యూ టీమ్ వి రాజేష్, జి రామేశ్వర్‌రావు, టి నరేష్, మహిళా కానిస్టేబుల్ పద్మ వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ వెల్లడించారు.

## పార్కింగ్ చేసి ఉన్న కారులో మంటలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 5: జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్‌లో పార్కింగ్ చేసి ఉన్న కారులో నుంచి మంటలు చెలరేగాయి. పట్టణానికి చెందిన మాడిదాల నర్సింహస్వామి అనే వ్యక్తి సోమవారం తన కారును తీసుకొని పని నిమిత్తం బయటకు వచ్చి మార్కెట్ ఏరియాలోని నర్సయ్య కంటి ఆసుపత్రి ఎదుట కారును పార్కింగ్ చేశాడు. కొద్దిసేపటి తర్వాత కారులో నుంచి పొగలు చెలరేగడంతో గమనించిన స్థానికులు నీళ్ల పంపు సహాయంతో మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నించారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా మంటలను పూర్తిస్థాయిలో ఆర్పివేశారు. కారు బ్యాటరీ షార్ట్‌సర్క్యూట్ కావడం వల్లనే ప్రమాదం జరిగి ఉంటుందని ఫైర్‌మెన్ మల్లయ్య తెలిపారు.

## దాడి చేసిన నలుగురిపై కేసు

నెన్నెల, ఆగస్టు 5:ఃతి మండలంలోని నార్వాయిపేటకు చెందిన రైతు పాల్వా రమేష్‌పై దాడి చేసిన పాల్వా లాక్య, పాల్వా రాజేష్, ధరవత్ రజిత, రవి అనే నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. రమేష్, లాక్యల పత్తి చేన్లు పక్కపక్కనే ఉన్నాయి. రమేష్ తన చేనుకు గడ్డి మందు కొట్టడంతో ఆ మందు ప్రభావంతో లాక్య చేనులోని పత్తి మొక్కలు ఎండిపోయాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ చేస్తున్న సమయంలో లాక్య కుటుంబ సభ్యులు కర్రలతో దాడి చేసి రమేష్‌ను కొట్టారని ఎస్సై పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## నాటు సారా పట్టివేత

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 5: లంబాడితండా, ఉత్కూరు గ్రామాల్లో సోమవారం దాడులు చేసి నాలుగు లీటర్ల నాటుసారాను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ తెలిపారు. భుక్య లక్ష్మీ, భుక్య అనితలపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక లారీ పట్టివేత

హాజీపూర్, ఆగస్టు 5: హాజీపూర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని సోమవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. లారీలో ఉన్న ఇసుకకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## దరఖాస్తు గడవు పొడిగింపు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 5: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్ 2024 దరఖాస్తు గడువును ఈ నెల 10 తేదీ వరకు పొడగించామని కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఆవిష్కర్త దరఖాస్తు చేసుకోవాలని, ఉత్తమ ఆవిష్కరణలను ఎంపిక చేసి ఈ నెల 15న అవార్డులు అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.



చింతలమానేపల్లిలో మొక్కలు నాటుతున్న అధికారులు





బెజ్జూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



వాంకిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

# స్వచ్ఛదనం-పచ్చదనం మన బాధ్యత

చింతలమానేపల్లి/బెజ్జూరు/రెబ్బెన/లింగాపూర్/వాంకిడి/పెంచికలపేట/సిర్పూర్(టి)/దహెగాం/కౌటాల/కెరమెరి, ఆగస్టు 5: మండలాల్లో అధికారులు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్ని నిర్వహించారు. స్వచ్ఛదనం-పచ్చదనం మన బాధ్యత అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలను నాటారు. మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. మురుగునీటిలో దోమలు గుడ్లుపెట్టి వృద్ధిచెంది ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపింపజేస్తాయన్నారు. పాఠశాలవిద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. చింతలమానేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, డీటీ మష్కూర్ అలీ, కార్యదర్శులు ఆసిఫ్‌అలీ, ఇస్తారి, విజయ్, శంకర్, మధుకర్, గోవర్ధన్‌సింగ్, అనిల్, విజయ్, ●బెజ్జూరులో ఎంపీడీవో గౌరీశంకర్, ప్రత్యేకాధికారి వెంకటేశం, కార్యదర్శి తుకారాం విద్యార్థులు, ● రెబ్బెనలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ, సిబ్బంది, ● లింగాపూర్‌లో ఎంపీవో శ్రీనివాస్, ● వాంకిడిలో తహసీల్దార్ రియాజ్‌అలీ, ఎంపీవో అజీ జుద్దీన్, ఐకేపీ మహేష్, కార్యదర్శి శివకుమార్, ● పెంచికలపేటలో ఎంపీడీవో ఆల్బర్ట్, ఏపీవో సతీష్, హెచ్‌ఎం విజయనిర్మల, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీటీచర్లు, ఆశా కార్యకర్తలు, ● సిర్పూర్(టి)లో ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ●దహెగాంలో ఎంపీడీవో రాజేందర్, ● కౌటాలలో ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీకార్యదర్శులు, అంగన్‌వాడీసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ● కెరమెరిలో జడ్పీడిప్యూటీ సీఈవో లక్ష్మీనారాయణ, ఎంపీడీవో అంజద్‌పాషా, ఎంఎన్‌వో ప్రకాష్, కార్యదర్శులు సతీష్, బొజ్జిరావు, వాజీద్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



దహెగాంలో మొక్కలు నాటుతున్న అధికారులు





సిర్పూర్(టి)లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు



కౌటాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



కెరమెరిలో మొక్కలు పంపిణీ చేస్తున్న జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ

## 'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

ఆసిఫాబాద్, ఆగస్టు 5: జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీలో పనిచేస్తున్న థర్డ్ పార్టీ ఉద్యోగులైన శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డ్‌లకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆసుపత్రి ఎదుట ధర్నా చేసి అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో నాయకులు మల్లేష్, మురళీ, మమత, నీల తదితరులు పాల్గొన్నారు.

## 'ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించాలి'

ఆసిఫాబాద్, ఆగస్టు 5: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీకి అనుగుణంగా నిధులను కేటాయించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ అభయ హస్తం కింద ప్రతికుటుంబానికి రూ.12లక్షల ఆర్థికసాయం అందజేయాలన్నారు. ప్రతి ఎస్సీ కుటుంబానికి శాశ్వత ఇల్లు నిర్మాణానికి అయిదు లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పవన్, వినోద్, గంగారాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్పించాలి:ఎన్ఎస్‌యూఐ

కెరమెరి, ఆగస్టు 5: వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధానకార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, విద్యపరంగా ఎంతో వెనకబడి ఉన్న వడ్డెరకులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గిడ్డప్ప, శ్రీనివాస్, దుర్గన్న, రజాక్, సుదర్శన్, కుసుంరావ్, సాజిద్, దేశ్‌ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

## పాత టీచర్లే కావాలని విద్యార్థుల ధర్నా

జైనూర్, ఆగస్టు 5: స్థానిక బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బదిలీ అయిన పాత టీచర్లే కావాలంటూ ఆ పాఠశాల విద్యార్థినులు సోమవారం పాఠశాలలో ధర్నా నిర్వహించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డీడీ రమాదేవి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం బదిలీ అయిన టీచర్లు రావడం వీలు పడదని నూతనంగా వచ్చిన కొత్త టీచర్లతో విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా నూతనంగా వచ్చిన టీచర్లు నాలుగు రోజులు కావడం లేదని వారిని తప్పు పట్టడం సరికాదన్నారు. విద్యార్థులను సముదాయించడంతో ఇక నుంచి ధర్నా చేయబోమని పేర్కొన్నారిని డీడీ తెలిపారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

చింతలమానేపల్లి, ఆగస్టు 5: పౌష్టికాహారంతోనే పిల్లలు, తల్లులు ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ తహసీల్దార్, బాలాజీఅనుకోడ గ్రామప్రత్యేకాధికారి మష్కూర్‌అలీ అన్నారు. మండలంలోని బాలాజీ అనుకోడ అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం చిన్నారులకు అన్నపాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లీబిడ్డల సంరక్షణ కోసం ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి విజయ్, అంగన్‌వాడీ టీచర్లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## తల్లిపాలపై అవగాహన

రెబ్బెన, ఆగస్టు 5: రెబ్బెన మండలం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ ముర్రుపాల ఆవశ్యకతపై వివరించారు. ముర్రుపాలు తాగితే పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు సంధ్యారాణి, స్వర్ణలత, మంజుల, బాలమ్మ, సాంబలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## 'పౌరసరఫరాల గిడ్డంగి అభివృద్ధికి కృషి చేస్తా'

సిర్పూర్(టి), ఆగస్టు 5: మండల కేంద్రంలోని పౌర సరఫరాల గిడ్డంగి అభివృద్ధికి కృషిచేస్తానని మార్కెట్ కమిటీఛైర్మన్ దేవయ్య అన్నారు. సోమవారం గిడ్డంగిని సందర్శించారు. అనంతరం గిడ్డంగి అధికారితో మాట్లా డి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట మార్కెట్‌కమిటీ డైరెక్టర్ సమీర్, తిరుపతి, తదితరులున్నారు.













# ప్రభుత్వ పాఠశాలలకు తొలగనున్న విద్యుత్ భారం



● ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనంలో సీఎం భరోసా ● కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

వాంకిడి, ఆగస్టు 5: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యమని, వాటికి ఉచిత విద్యుతు సౌకర్యం కల్పిస్తామని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం భరోసా ఇచ్చారు. ఈ విధానం అమలైతే ప్రతినెల స్థాయినిబట్టి ఒక్కొక్క పాఠశాలకు రూ.300నుంచి రూ.2000 వరకు విద్యుత్తు బిల్లుల భారం తగ్గిపోతుంది. ప్రథమిక పాఠశాలల్లో రెండు లేదా మూడు గదులు, వరండాలు ఉంటాయి. గతంలో కేవలం దీపాలు మాత్రమే ఉండేవి. మనఊరు-మనబడి పథకం వచ్చిన తర్వాత గదుల్లో ఫ్యాన్‌లను ఏర్పాటు చేశారు. గది విశాలంగా ఉంటే రెండేసి ఫ్యాన్లు అమర్చారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుంటే ప్రాథమిక పాఠశాలల్లో మూడు నుంచి అయిదు బల్బులు, నాలుగు ఫ్యాన్లు పని చేస్తున్నాయి. కొన్ని చోట్ల బోరు, మోటార్లు ఉన్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో నాలుగు నుంచి ఆరుతరగతి గదులు ఉంటున్నాయి. ఇక్కడ ప్రతి నెలా విద్యుత్ బిల్లులు రూ.500నుంచి రూ.800వరకు వచ్చేవి. ఉన్నత పాఠశాలల్లో గదుల సంఖ్య ఎక్కువే. కొన్నిచోట్ల రెండేసి మీటర్లు ఉన్నాయి. తాగునీటి బోరు, శుద్ధజల ప్లాంట్లు పని చేస్తున్నాయి. ఇటీవల డిజిటల్ తెరలు ఏర్పాటు చేశారు. వీటన్నింటి నేపథ్యంలో ప్రతి ఉన్న త పాఠశాలకు ప్రతినెల రూ.1500 నుంచి రూ.2000లకు పైగా బిల్లులు వస్తున్నాయి. అయితే పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ అవి ఎటూ సరిపోకపోవడంతో విద్యుత్‌బిల్లులు చెల్లించడం ప్రధానోపాధ్యాయులకు భారంగా మారింది.

### స్కూల్ గ్రాంట్ సగం విద్యుత్ బిల్లులకే..

బడి నిర్వహణకు మంజూరు చేసే నిధుల్లోంచి విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతిఏడాది స్కూళ్లకు ప్రత్యేకగ్రాంట్లు మంజూరవుతాయి. విద్యార్థుల నమోదుస్లాబ్ ఆధారంగా కాంపొజిటివ్ స్కూల్ గ్రాంట్ కేటాయించారు. 30మంది లోపు విద్యార్థులుంటే రూ. 10వేలు, 100మంది లోపు ఉంటే రూ.25వేలు, 250మందిలోపు ఉంటే రూ.50 వేలు, వెయ్యి మందిలోపు ఉంటే రూ.75వేలు, 1000మందికి పైగా రూ.లక్ష నిధులు మంజూరు చేస్తారు. ఈ గ్రాంటు సంవత్స రానికి రెండుసార్లు మాత్రమే విడుదల చేస్తారు. ఇందులో సగం వరకు విద్యుత్‌బిల్లులకు చెల్లిస్తుండగా మిగతావి మరుగుదొడ్ల క్లీనింగ్, తాగునీరు, చిన్నపాటి మరమత్తులు, స్టేషనరీ, ప్రయోగసామగ్రి, చాక్‌పీసులు, జెండాపండుగలు ఇతరత్రా అవసరాలకు వినియోగిస్తున్నారు. వచ్చే గ్రాంట్‌లో సగం మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లిస్తుండడంతో రూ. వేలాదిగా విద్యుత్ బిల్లులు పాఠశాలలకు సకాలంలో రాకపోవ డంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఇప్పుడు ఉచిత విద్యుత్ సరఫరా ప్రకటన మూలంగా ప్రధానోపాధ్యాయులకు కొంతమేర భారం తగ్గనుంది. విద్యుత్‌కోసం వెచ్చిస్తున్న నిధులను పాఠశాలల్లో ఇతర చిన్నచిన్న అవసరాల కోసం ఉపయోగించుకోనే అవకాశం ఏర్పడనుంది.

### ఉచిత విద్యుత్‌సరఫరా మంచిదే..

**ఉప్రె వినేష్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు**



ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్‌సరఫరా చేయడం మంచి నిర్ణయం. పాఠశాలల్లో డిజిటల్ బోర్డుల నిర్వహణతోపాటు అనేక అవసరాలకు విద్యుత్ అవసరం ఉంటుంది. వచ్చిన గ్రాంట్లు మౌలిక అవసరాలకే సరిపోవడం లేదు. విద్యుత్ బిల్లులు భారంగా మారాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలకు ఉచిత విద్యుత్‌సరఫరా అందించాలని సీఎం తీసుకున్న నిర్ణయం హర్షనీయం

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్, ఆగస్టు 5: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అదనపుకలెక్టర్ దాసరివేణు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆయన ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దహెగాం మండలం హత్తినికి చెందిన రేగుంట కిష్టమ్మ తన భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఈ విషయమై తనకు న్యాయం చేయాలని దరఖాస్తు చేశారు. ఆసిఫాబాద్ మండలం ఎల్లారం గ్రామానికి చెందిన దుర్గం ధర్మయ్య తనతండ్రి గత నెలలో మృతి చెందాడని, మరణ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలని అర్జీ సమర్పించారు. రెబ్బెన మండలం నవేగాం గ్రామానికి చెందిన శేఖర్ తనకు గల భూమికి ప్రభుత్వం అమలుచేస్తున్న రుణమాఫీ అందించాలని దరఖాస్తు చేసుకున్నారు. బెజ్జూరు మండల కేంద్రానికి చెందిన మౌనిక జీవనాధారం కొరకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సహాయవంట మనిషి పోస్టు ఇప్పించాలని అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామానికి చెందిన గంగన్న తన తండ్రి పేరిట గ్రామ శివారులో ఉన్న పట్టాభూమిని తన పేరిట మార్పుచేయాలని దరఖాస్తు అందజేశారు. తిర్యాణిమండలం దుగ్గాపూర్ గ్రామానికి చెందిన భూమయ్య తనకు గ్రామ శివారులో పట్టాభూమిఉందని ఈ భూమి కొంతభాగాన్ని విక్రయించానని కొనుగోలు చేసిన వారు అదనంగా మరో 9గుంటల భూమిని పట్టా చేసుకున్నారని, దీనిపై విచారణజరిపి తనకు న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. కెరమెరి మండలం అంతాపూర్ గ్రామానికి చెందిన కవిత తాను షెడ్యూల్డ్ కులానికి చెందిన నిరుపేదనని తనకు ఉపాధికల్పించి ఆదుకోవాలని అర్జీ సమర్పించింది. కాగజ్‌నగర్ మండలం కడంబా గ్రామానికి చెందిన ప్రమీల తనకు బెజ్జూరుమండలం చిన్నసిద్దాపూర్ గ్రామశివారులో వ్యవసాయ భూమి ఉందని, ఈభూమిని అక్రమంగా ఇతరులు పట్టా చేసుకున్నారని ఈ విషయమై విచారణ జరిపి న్యాయం చేయాలని అర్జీ సమర్పించింది. ఆసిఫాబాద్ మండలం హీరాపూర్ గ్రామస్థులు తమ గ్రామంలోని వాగుకు వంతెన, రోడ్డు నిర్మించాలని దరఖాస్తు అందజేశారు. జైనూర్ మండలం పటేల్‌గూడ గ్రామానికి చెందిన శంబుదేవ్ తనతండ్రి క్షేత్రసహాయకుడిగా పనిచేస్తూ విధుల్లోనే పాము కాటుకు గురై మరణించారని, ఆ ఉద్యోగాన్ని తనకు ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు.

## ఆంగ్ల భాషపై పట్టు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న ఉపసంచాలకురాలు రమాదేవి

ఆసిఫాబాద్, ఆగస్టు 5: గిరిజన పాఠశాలల్లో ఆంగ్లభాష సామర్థ్యాల కోసం ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని గిరిజనసంక్షేమ ఉప సంచాకులు ఆర్ రమాదేవి అన్నారు. తెలంగాణ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సౌజన్యంతో ఆంగ్లబోధన ఉపాధ్యాయులకు రెండురోజుల శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని బాలికల క్రీడా ఆదర్శ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వగిరిజన సంక్షేమపాఠశాలలను ఆంగ్లమాధ్యమంలో మార్పు చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పదవ తరగతి విద్యార్థులు మొట్టమొదటిసారిగా పబ్లిక్‌పరీక్షలు ఇంగ్లీష్‌మాధ్యమంలో రాయనున్నట్లు తెలిపారు. ప్రాథమికస్థాయి నుంచి ఇంగ్లీష్ సామర్థ్యాలను పెంపొందించ డానికి ఉపాధ్యాయులు అంకితభావంతో కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, క్యాంపు ఇన్‌చార్జి కృష్ణారావు, డీఎస్‌వో మీనారెడ్డి, ఏటీడీవో చిరంజీవి, ఏసీఎంవోలు రాజమౌళి, ఆర్పీలు శంకర్, వామన్‌రావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అభిజిత్, మీనాక్షి, పవన్, నిక్షిత తదితరులు పాల్గొన్నారు.

## 'లక్ష్మీనగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి'

వాంకిడి, ఆగస్టు 5: మండల కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్‌పార్టీయూత్ అధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు తహసీల్దార్ రియాజ్‌అలీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో పేదప్రజలకు ప్రభుత్వం కల్పించిన ప్లాట్‌లలో 13 సంవత్సరాలుగా ఇల్లు నిర్మించి నివాసం ఉంటున్నారన్నారు. అయినప్పటికీ గ్రామ పంచాయతీ వారు ఇంటిపన్నులు తీసుకోవడం లేదన్నారు. లక్ష్మీనగర్ కాలనీలో నివసిస్తున్న ప్రజలదరి ఇంటిపన్నులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## బాధ్యతలు స్వీకరించిన జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

ఆసిఫాబాద్, ఆగస్టు 5: జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిగా బానోత్ దత్తారావు సోమవారం బాధ్యతలు స్వీరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పనులను అధికారుల సమన్వయంతో పూర్తిచేసే విదంగా కృషి చేస్తానని అన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడపకూడదు

ఆసిఫాబాద్, ఆగస్టు 5: వాహనదారుకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యంతాగి వాహనాలు నడపరాదని ఎస్సై రాజేశ్వర్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులను బ్రీత్‌ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగి వాహనాలు నడపకూడదన్నారు.

## కడుపు నొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య



సెండే సోని(ఫైల్)

వాంకిడి, ఆగస్టు 5: మండలంలోని బెండార గ్రామానికి చెందిన సెండే సోని(20) కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సోని హైదరాబాద్‌లోని ప్రైవేట్‌కళాశాలలో జీఎస్ఎం సెకండియర్ చదువుతోంది. కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటోంది. సోమవారం ఉదయం పనికి వెళ్లిన తండ్రి సెండే బొంద్యాలు మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగి కింద పడిపోయింది. వెంటనే ఆయన కూతురిని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి సెండే బొంద్యాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## బీఆర్ఎస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, ఆగస్టు 5: కాగజ్‌నగర్‌లో రోడ్లపై ఏర్పడిన గుంతల పూడ్చి బాగుచేయాలని సోమవారం బీఆర్ఎస్ నాయకులు బజ్‌రంగ్ దళ్‌చౌరస్తా వద్ద ఉన్న గుంతలో నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు మాట్లాడుతూ ఎస్పీఎంకు కర్రలోడ్‌తో వస్తున్న లారీలతో రోడ్లు దెబ్బతింటున్నాయన్నారు. వెంటనే గుంతలను పూడ్చి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం ఎస్పీఎం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోయిన్, కోకన్వీనర్ అంబాల ఓదెలు, కోఆర్డినేటర్ సలీం, టౌన్ జనరల్‌సెక్రెటరీ నక్క మనోహర్, యూత్ అధ్యక్షులు రాజు, తన్నీరు పోచం, మారుపక శోభన్, మహమూద్, గోగర్ల కన్నయ్య, గోపి పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ వర్గీకరణపై పునః సమీక్షించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, ఆగస్టు 5: ఎస్సీఎస్టీ వర్గీకరణపై పునః సమీక్షించాలని కొంతమంది స్థానిక నాయకులు అదనపు కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణతో మాలకులస్థులకు అన్యాయం జరిగే అవకాశాలున్నాయన్నారు. వీటితోపాటు క్రిమీలేయర్ విధానం కూడా పరిశీలించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్ సునీల్ ఉన్నారు.

**అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన**

మండలంలోని దంతన్‌గూడ అమ్మ ఆదర్శపాఠశాల పనులను సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై అడిగితెలుసుకున్నారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

## ఆసుపత్రి రోడ్డును బాగు చేయించిన అధికారులు

**'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన**



ఆసుపత్రి రోడ్డుపై మొరం వేసి చదును చేయిస్తున్న కార్యదర్శి

బెజ్జూరు, ఆగస్టు 5: అధికారులు స్పందించి ఆసుపత్రికి వెళ్లే రోడ్డును బాగు చేయించారు. ఆసుపత్రికి వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో రోగులు ఇబ్బందులుపడుతన్న కష్టాన్ని సోమవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా అను బంధంలో 'బురదమయంగా మారిన ఆసుపత్రిరోడ్డు' అన్నకథనాన్ని ప్రచురిం చడంతో గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారాం స్పందించి బురదరోడ్డుపై మొరం వేయించి చదును చేయించారు. దీంతో గ్రామాలప్రజలు, సిబ్బంది హర్షంవ్యక్తం చేస్తున్నారు.

## పోస్టాఫీసు పథకాలపై అవగాహన

సిర్పూర్(టి), ఆగస్టు 5: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గ్రామీణప్రజలకు చేరవేసేందుకు పోస్టాఫీసు ద్వారా అందుతున్నటువంటి పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నట్లు కాగజ్‌నగర్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. సోమవారం మండలంలోని వెంపల్లి పోస్టాఫీసు ద్వారా పలురకాల చిన్నమొత్తాలపొదుపు పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే గ్రూప్ యాక్సిడెంట్‌గ్యాగ్ పాలసీ అతి తక్కువ ప్రీమియంకే అందిస్తున్నట్లు తెలిపారు. మృతిచెందితే ఆ లోటు తీర్చలేనిదని, ప్రతిఒక్కరూ ప్రమాదబీమా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణమాస పూజలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బెజ్జూరు, ఆగస్టు 5: శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా మండలకేంద్రంలోని ఆలయాల్లో సోమవారం భక్తులు చాతుర్మాస పూజలు నిర్వహించారు. నాలుగు నెలల పాటు పండుగలు, వేడుకలు ఎక్కువగా ఈ నెలలోనే ఉండడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది.

## స్వచ్ఛదనం- పచ్చదనం నిరంతర ప్రక్రియ: కలెక్టర్




ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



కాగజ్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే హరీష్‌బాబు

ఆసిఫాబాద్, ఆగస్టు 5: పచ్చదనం పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకువచ్చిన స్వచ్ఛదనం- పచ్చదనం అనేది నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఆర్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛ దనం- పచ్చదనం కార్యక్రమానికి ఆయన జిల్లా అటవీశాఖాధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్‌తో కలిసి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. అయిదు రోజులపాటు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.దీనిలో భాగంగా గ్రామసభలు ఏర్పాటుచేసి స్థలం ఉన్న ప్రతిచోట మొక్కలు నాటేలా చూడాలన్నారు. అధికారులు తాజా మాజీ ప్రతినిధులను భాగస్వామ్యం చేసుకొని ముందుకు సాగాలన్నారు. అలాగే అడగ్రామంలో డీపీవో భిక్షపతి, ఆర్డీవో లోకేశ్వర్, ఎంపీడీవో శ్రీనివాస్‌తోపాటు గ్రామస్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

**మొక్కలు నాటి సంరక్షించాలి**
**-అదనపు కలెక్టర్ దీపక్ తివారి**

**కాగజ్‌నగర్:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించేందుకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటితే భావితరాలకు ఆహ్లాదకర వాతావరణం ఉంటుందన్నారు. కాలుష్య రహిత సమాజం ఏర్పడుతుందన్నారు.ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధుల ప్రబలే అవకాశాలుండటంతో అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం స్వచ్ఛదనం, పచ్చదనం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ షాహీన్‌సుల్తానా, మాజీ మున్సిపల్ ఛైర్మన్ దస్తగిర్‌తోపాటు ఆర్డీవో సురేష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్‌కుమార్ వార్డుల కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని విలేజీనం.5లో కూడా వనమహోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు.

## ఆసిఫాబాద్ మండలంలో పులి సంచారం



గోవిందాపూర్‌లో పులి అడుగులను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

ఆసిఫాబాద్, ఆగస్టు 5: ఆసిఫాబాద్ మండలం గుండి, గోవిందాపూర్ గ్రామ సమీపంలో సోమవారం పులి అడుగులను గ్రామస్తులు గుర్తించారు. వ్యవవసాయ చేనులలో పులి అడుగులు కనిపించడంతో మాజీ ఉపసర్పంచ్ గోవింద్, రైతులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, ఏఎస్సై రాములు అడుగులను పరిశీలించారు. పులి మండలంలోని గుండి గ్రామం మీదుగా గోవిందాపూర్ వరకు వచ్చినట్లు వాటి అడుగుల ద్వారా గుర్తించారు. అయితే కొంత కాలంగా అంకుశాపూర్ గ్రామపరిధిలోని కెనాల్ ప్రాంతంలో నివాసం ఏర్పర్చుకున్న పులి జిల్లాకేంద్రం వైపు వచ్చిందా లేదా కొత్త పులి జిల్లాకు వచ్చిందా అనే కోణంలో అధికారులకు అంతుచిక్కడం లేదు. పులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించడంతో డిప్యూటీరేంజ్ అధికారి యోగేష్ మాట్లాడుతూ గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రిపూట ఒంటరిగా తిరగకూడదన్నారు. సాధారణంగా పులి రాత్రి నుంచి ఉదయం 6గంటల వరకు తిరుగుతుందని ఆ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా పులి కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని తెలిపారు. పులి ఎటువైపు వెళ్లిందనేది గుర్తించనున్నట్లు తెలిపారు.




## ఆందోళనతో దిగి వచ్చిన యాజమాన్యం

బెల్లంపల్లి, ఆగస్టు 5: పట్టణంలోని సింగరేణి ఏరియాఆసుపత్రిని అభివృద్ధిచేయాలని కోరుతూ ఆసుపత్రి పరిరక్షణకమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టగా సింగరేణి యాజమాన్యం దిగి వచ్చిందని కమిటీ నాయకులు తెలిపారు. సోమవారం బెల్లంపల్లిలో వారు మాట్లాడుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సింగరేణి సీఎండీతో మాట్లాడారని తెలిపారు. దీంతో కొత్తగూడెం నుంచి సీఎంవో సుజాత కార్మికసంఘాల నాయకులతో చర్చలు జరిపారని, సెప్టెంబరుచివరి వారంలోగా ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారన్నారు. ఇచ్చిన హామీనినెరవేర్చాలని లేకుంటే తీవ్ర ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చిప్పనర్సయ్య, దాగం మల్లేష్, రాజమౌళి, జయరాంయాదవ్, అఫ్జల్, మణిరాంసింగ్, మహేష్, చాంద్‌పాషా, జయపాల్‌సింగ్, శంకర్, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

## 'అధికారుల బదిలీల్లో పారదర్శకత కరువు'

శ్రీరాంపూర్, ఆగస్టు 5: ఇటీవలజరిగిన అధికారుల బదిలీల్లో పారదర్శకత కరువైందని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం సింగరేణి సీఎండీ ఎన్ బలరాంకు లేఖ రాశారు. ప్రతి నాలుగేళ్లకోమారు ట్రాన్స్‌ఫర్, ప్రమోషన్లు ఉంటాయన్నారు. కానీ కొందరు అధికారులు పదేళ్ల ఒకేచోట పనిచేస్తున్నా వారు బదిలీ కాలేదన్నారు. పైరవీలకు పెద్దపీటవేశారని, లాంగ్‌స్టాండింగ్‌లో ఉన్న విజిలెన్స్ అధికారులపై ఎన్ని ఫిర్యాదులున్నా వారిని ముట్టుకోలేదన్నారు. పైగా పలు ఏరియాల్లో ప్రమాదాలకు కారకులైన వారికి పదోన్నతులు కూడా ఇచ్చారన్నారు. విజిలెన్స్, ఐఈడీ, పర్చేజ్, కొన్ని ఇతర విభాగాల్లో బదిలీలు జరుగలేదన్నారు. బదిలీలను మరోమారు సమీక్షించి పారదర్శకంగా నిర్వహించాలని ఆయన కోరారు.

## ప్రమాదాలకు నిలయంగా కోల్‌బెల్ట్ రోడ్డు



గుంతల్లో నిలిచిన నీరు

మందమర్రి టౌన్, ఆగస్టు 5: పట్టణంలోని పాలచెట్టు కోల్‌బెల్ట్ ప్రమాదాలకు నిలయంగా మారింది. కురుస్తున్న వర్షాలకు వరదనీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. వర్షాలకు రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే వీటిసీ నుంచి కేకే5గనికి వెళ్లే రోడ్డు గుంతలు పడడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళలో విధులకు వెళ్లే కార్మికులు భయపడుతున్నారు. పాలచెట్టు నుంచి కేకే5 బంగ్లాస్‌వరకు రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు జారిపడుతున్నారు. వెంటనే నీరు రోడ్డుపై నుంచి వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతు న్నారు.

## 'కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం'

మందమర్రిటౌన్, ఆగస్టు 5: సింగరేణి కార్మికుల హక్కుల సాధనే తమ లక్ష్యమని ఏఐటీయూసీ మందమర్రి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, బ్రాంచ్ వైస్‌ప్రెసిడెంట్ భీమనాథుని సుదర్శన్ అన్నారు. సోమవారం ఏరియా వర్కుషాపులో గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడారు. గత సంవత్సరం సింగరేణిలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు తమపై నమ్మకం పెట్టుకుని గుర్తింపు సంఘంగా ఎన్నుకున్నారన్నారు. వారినమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తున్నామన్నారు. యాజమాన్యం వెంటనే 35శాతం లాభాల వాటాను ప్రకటించాలని, ఇన్‌కంట్యాక్స్ కూడా యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎంపీఎఫ్ చిట్టీలను వెంటనే అందజేయాలన్నారు. సమావేశంలో నాయకులు కంది్రశీనివాస్, టేకుమట్ల తిరుపతి, బానయ్య, శర్మ పాల్గొన్నారు.

## రుణమాఫీ కోసం పడిగాపులు

బెజ్జూరు, ఆగస్టు 5: ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం కార్యాలయానికి మండలంలోని వివిధ గ్రామాలకుచెందిన రైతులు రుణమాఫీ కోసం రాగా ఎవరూ లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లారు. సహకార సంఘంలో పనిచేస్తున్న సిబ్బంది తమ వేతనాల కోసం ఆసిఫాబాద్‌కు వెళ్లినట్లు రుణమాఫీ డబ్బులు ఇవ్వడం సాధ్యంకాదని కిందిస్థాయి సిబ్బంది చెప్ప డంతో రైతులంతా వెనుతిరిగారు.

## రేషన్ బియ్యం పట్టివేత

పెంచికలపేట, ఆగస్టు 5: మండలంలోని కొండపల్లి గ్రామంలోని శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన అయిదు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించగా అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న పీడీఎస్ బియ్యంను పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్సై వెంకటేష్, కానిస్టేబుళ్ల మధు, రమేష్ పాల్గొన్నార న్నారు.

## 'ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలి'

సిర్పూర్(టి), ఆగస్టు 5: సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలని పేర్కొంటూ సోమవారం మండలకేంద్రంలోని దళితసంఘం నాయకులు అంబేద్కర్ భవనం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.